# నీడల నీడలు

యు. ఆర్. కృష్ణ

హౌసింగ్ బోర్డువాళ్లు కట్టిస్తున్న యిల్లు యెంతవరకూ వొచ్చిందీ, యిల్లు అప్పగించాక యింకా యెన్ని వేలు ఖర్చు పెట్టాల్సి వుంటుందీ లెక్కలు వేసి చెప్పుకుపోతున్న రామ్మూర్తి నీళ్లు తాగుతూ సావిత్రి కంచంలోకి చూసాడు. పెట్టుకున్న అన్నం అలానే వుంది. అన్య మనస్కంగా రామ్మూర్తి చెప్పేది వింటూ కంచంలో వేళ్లు పెట్టి కెలుకుతూ మధ్య మధ్య రెండు మెతుకులు నోట్లో వేసుకుం టోంది. బయట గదిలో మెల్లగా చదువు కుంటున్న బాబు, చెల్లెలు చిన్ని బిగ్గరగా చదువుతుంటే కోపం వొచ్చి తనూ గొంతు పెంచేడు. ఒక్క నిముషంలో పోటీలు పెరిగి యిద్దరూ గొంతులు చించు కుని చదువుకోసాగారు. భార్యను యేదో అడుగుదామనుకున్న రామ్మూర్తి పిల్లల గొడవకు ఆగిపోయాడు. పిల్లల మీద కోపం వొచ్చినా యేమీ కేకవెయ్యకుండా వూరుకుని తొందర తొందరగా భోజనం ముగించి పడగ్గదిలోకి పోయి మంచం మీద కూర్చున్నాడు. సావిత్రి కూడా నిండు కంచంతోనే లేచి గిన్నెలు సర్ద సాగింది.

సిగరెట్టు వెలిగించు కూర్చున్న రామ్మూర్తికి భార్య ముఖావానికి, తిండి సరిగ్గా తినకపోవడానికి కారణం కొంచెం తెలిసింది. సావిత్రి ప్రవర్తన వింతగా వుండి నవ్వుకూడా వొచ్చింది. వెంటనే పదిరోజులుగా రాజమ్మ విషయంలో సావిత్రిలో వొచ్చిన మార్పులు కళ్ల ముందు కదిలేయి.

రెండేళ్లక్రిందట సావిత్రికి పెద్ద ఆపరేషనుచేసినప్పుడు పట్నంలోపనివాళ్ల దొరక్క యిబ్బందిపడుతూ పనిపిల్లను చూసిపెట్టమని పల్లెలో వున్న అక్కకు వుత్తరం రాసింది. దొరికిన పనిమనుషులు చేసే పని సావిత్రికి నచ్చేదికాదు. పని చేసి వాళ్లు వెళ్లిపోగానే గిన్నెలన్నీ మళ్లీ తోముకునేది. "ఎక్కడిదక్కడ పెట్టేసి యిక్కడో చీపురు అక్కడో చీపురు వేసేసిపోయిందని" విసుక్కుంటూ వోపిక కూడదీసుకుని మళ్లీ తుడుచుకు నేది. ఆ రోజుల్లోనే పదేళ్ళపిల్ల రాజమ్మ వాళ్లింటికి పల్లెనుండి పనిపిల్లగా వొచ్చింది. వాళ్లింటికి వొచ్చేప్పటికి యేపని చెయ్యడమూ సరిగ్గా రాకపోయినా కొద్దికాలంలోనే అన్ని పనులూ నేర్చుకుని సావిత్రి అభిమానానికి పాత్రురాలయ్యింది.

"దీనికి నాకంటే శుభ్రం యెక్కువ.

తోమితోమి గిన్నెలు అరగతీసేస్తుంది. పదిరోజులకో చీపురు కావాల్సొచ్చేట్టుంది" అని నవ్వుతూ మెచ్చుకునేది రాజమ్మను.

వొచ్చినప్పుడు సన్నగా పీక్కుపోయి నట్టున్న పిల్ల మంచి తిండి దొరకడంతో వొళ్లుచేసి నునుపుతేరింది. "నలుపైనా మా రాజమ్మ మొహంలో సిరివుంది" అని అభిమానం యెక్కువైనపుడు యిరుగు పొరుగుతో అనేది సావిత్రి. పండగలకూ, పబ్బాలకూ పిల్లలకు కొత్తబట్టలు కుట్టించి నపుడల్లా రాజమ్మకు కూడ కుట్టించేది. ఇంట్లో యేమి వండినా పిల్లలతో సమానంగా పెట్టేది.

ఓసారి కూతుర్ని చూసిపోదామని వొచ్చిన రాజమ్మతల్లి మంచి బట్టల్లో ఆరోగ్యంగా మెరిసిపోతున్న కూతురిని చూసి ఆశ్చర్యపోయింది. పనిపిల్లను సొంత కూతురిలా చూసుకుంటున్న సావిత్రమ్మ గొప్ప మనసుని వేనోళ్ల పొగిడింది. పల్లెలో కూడ సావిత్రమ్మ యెంత చల్లని తల్లో యింటింటికీ వెళ్లి చెప్పింది. ఇరుగుపొరుగు కూడ సావిత్రిని ఆ విషయంలో పొగుడుతూ వుంటారు.

ఇంతకాలం బాగానే జరిగింది కాని పదిరోజులక్రితం బజారు నుండి సరుకులు

తీసికొస్తున్న రాజమ్మ కాలిలో గాజు పెంకు గుచ్చుకుంది. కాలంతా రక్తంతో, యేడుస్తూ కుంటుకుంటూ వొచ్చిన రాజమ్మను చూడగానే సావిత్రి గుండె తరుక్కుపోయింది. మందురాసి కట్టుకట్టి పడుకోబెట్టి పనంతా తనే చేసుకుంది. తరువాత రెండు రోజులూ బాధపడుతూనే కుంటుకుంటూ ఆ పనీ యీపనీ చేసింది రాజమ్మ. మూడోనాటికి టెంపరేచరు పెరిగి లేవలేకపోయింది. దాని పరిస్థితికి బాధపడుతూ కొడుకునీ, ప్రక్కింటి వాళ్లమ్మాయినీ తోడిచ్చి రిక్షాలో గవర్నమెంటు ఆసుపత్రికి పంపించింది సావిత్రి. రెండురోజులు వాళ్లు యేవో యింజక్షన్లుచేసి మాత్రలిచ్చేరు. జ్వరం తగ్గింది కాని పిల్ల దానికి నీరసం తగ్గలేదు.

కాలిలో చీముపట్టి నడవడం కష్టం అయ్యి పడుకున్న చాపమీదనుండి లేవలేకపోయింది.

నాలుగు రోజులుగా కష్టపడి యింటి పనంతా చేసికోవడమే కాకుండా ముసుగు తన్ని మూలుగుతూ పడున్న పనిపిల్లకు అవీ యివీ అందించి తిండి పెట్టాల్సొచ్చే తన పరిస్థితికి జాలేసింది. కోపంకూడ వొచ్చింది. కాని వెంటనే మనసును కసురుకుంది.

'ఛా! యిలా ఆలోచిస్తున్నానేమిటి? తనకు ఆపరేషన్ చేసాక తరచూ నీరసం వొచ్చి పడుకుని లేవలేకపోతే యిల్లంతా చక్కదిద్ది తన కెన్ని సేవలు చేసింది? ఆ మధ్య చిన్నికి జబ్బుచేసి రెండ్రోజులు యెడతెరిపిలేకుండా విరేచనాలైతే నిద్ర లేకుండా చిన్నపిల్లైనా తనతోపాటు యెలా చేసింది! ఆ గవర్నమెంటు ఆసుపత్రి లాభంలేదు. పోతే పోయినాయి పదిరూపాయిలు. వెధవ ఖర్చులు యెన్ని చేయడంలేదూ! వసంతమ్మ డాక్టరు దగ్గరకు తీసికెళ్తాను" అనుకుని ఆ రోజే రాజమ్మను డాక్టరు దగ్గరకు తీసికెళ్లింది.

"ఏమిటమ్మా! యిన్నిరోజులూ యేం చేస్తున్నారు? కాలంతా కుళ్లి పాడయ్యే వరకూ వూరుకుని తీసుకు రావల్సింది" అని చివాట్లు పెట్టి పది రూపాయిలు ఫీజు తీసుకుని పోపుసామాను రాసినట్టు మందులు రాసి రోజూ యింజక్షను చేయించుకోడానికి రమ్మంది. మందులకు మరో పదిహేనయ్యాయి. పనిపిల్ల పేరు చెప్పి పాతిక రూపాయిలు వొదిలినందుకు మనస్సు చివుక్కుమన్నా రాజమ్మ పడే బాధ చూసి నచ్చచెప్పుకుంది సావిత్రి.

తరువాత రెండు రోజులూ రాజమ్మను డాక్టరు దగ్గరకు పంపించింది. డబ్బులు ఖర్చవ్వడం తప్పితే రాజమ్మ బాధ తగ్గలేదు. రాజమ్మను చూస్తుంటే సావిత్రిలో తనకే తెలియని మార్పేదో రాసాగింది. ఇదంతా రామ్మూర్తి గమనిస్తున్నాడు కాని యేమీ కల్పించుకోలేదు. అన్ని పనులూ చేసిపెట్టే పనిమనిషికి అలవాటు పడ్డ సావిత్రి హఠాత్తుగా వొక్కత్తీ ఎడ్జెస్టు కాలేక పిల్లలను విసుక్కునేది.

బండచాకిరీ చెయ్యాల్సొచ్చినందుకు తన ఆడపుట్టుకను ఆడిపోసుకునేది. మెల్లగా కోపం, దీనికంతకూ కారణమై తనకిన్ని కష్టాలు తెచ్చిపెట్టిన రాజమ్మమీదకు మళ్లింది. ఏదో వొంకతో మనసులోని కోపాన్ని బయటకు వెళ్లగక్కేది.

"నేను చెయ్యలేనమ్మా! ఒకరోజు, రెండురోజులు. అంతేగాని యిలా రోజుల తరబడి పనిమనిషికి సేవలు చెయ్యాలంటే నా వల్లకాదు. జరుగుతుంటే పడుకుని అది యెన్నైనా చేయించుకుంటుంది. అవతల మందులకూ, మాకులకూ డబ్బేమో నీళ్లల్లా ఖర్చుపెడుతున్నామాయె. మీరు చూస్తూనే వున్నారుగా. రోజూ రిక్షాలకే యెంత పోస్తున్నామో! పోనీ తగ్గితే సంతోషమే, అదీ లేదు. ఇదంతా నా చావుకొచ్చింది" అని పక్కింటి సుందరమ్మతో తన బాధ వెళ్లబోసుకుంది సావిత్రి.

"మీరు కాబట్టి చేస్తున్నారొదినా. ఇంకొకరయితేనా! పిల్ల తల్లితండ్రులకు కబురు పంపించి పంపేయరూ! మనింట్లో

పనిచేసిందని యెన్నాళ్లు పెట్టుకుంటాం మనం మాత్రం. పని చేసినపుడు మూడు పూటలా తిండిపెట్టి డబ్బులివ్వలేదూ! డబ్బులు పడేయాలేగాని పనిచేసేవాళ్ల క్కొదవా! ఇది కాకపోతే యింకొకత్తి వొస్తుంది." అని సుందరమ్మ అంటించి పోయింది.

ఆ మాట, దారితప్పిపోయి యేడుస్తున్న పిల్లాడికి అమ్మను నాన్ననూ చూపించినట్టయింది సావిత్రికి. గుండెల మీద నుండి పెద్దబరువు తీసేసినట్టయింది. 'తనది కాని బరువు తనెందుకు మొయ్యాలి దీన్ని పల్లెకు పంపేస్తే పీడావిరగడై పోతుంది." అనుకుని—కన్నవాళ్లను పంపి పిల్లను తీసికెళ్లిపోయేట్టు చూడమని పల్లెలో వున్న అక్కకు కార్డురాసి పడేసింది.

"కార్డు రాస్తే వాళ్లు తీరిగ్గా యెప్పుడు వస్తారో? అంతవరకూ దీనికి చేసిపెట్ట డానికి నాకు వోపిక లేదు. ఆ డాక్టరమ్మ మళ్ళీ మందులు మార్చింది. ఇవన్నీ మనమెక్కడ కొంటాం? మీరు ఆఫీసుకి వెళ్లేప్పుడు వెంటనే వొచ్చి కూతుర్ని తీసికెళ్ళమని టెలిగ్రాం యివ్వండి" అని పదిసార్లు చెప్పి మర్నాడే రామ్మూర్తి చేత టెలిగ్రాం యిప్పించింది.

టెలిగ్రాం చూసి కూతురికి యేమయ్యిందోనని పరుగెత్తుకొచ్చింది రాజమ్మ తల్లి. గుండ్రంగా బంతిలా వుండే కూతురు చిక్కిపోయి మూలపడుండడం చూసి గుండె తరుక్కుపోయింది. పది రోజులుగా దానిక్కావల్సినవన్నీ అమ్మగారే చేసి పిల్లను కడుపులో దాచుకున్నందుకు అమ్మగారి కాళ్ళు పట్టుకున్నంత పనిచేసింది. పిల్లను అక్కడే వుంచి వైద్యం చేయిస్తే బాగుండునని ఆశపడింది కాని అమ్మగారి మొహంచూసి ప్రయాణమయ్యింది.

వెళ్ళిపోతుంటే సావిత్రి రాజమ్మ తల్లితో 'పిల్లచేత తగ్గేవరకూ యేపనీ చేయించకు. ఈ పాతిక రూపాయలూ వుంచి వైద్యం చేయించు. నేనే వుంచుకుందును గాని పిల్లది నీమీద బెంగ పెట్టుకుంది' అని సాగనంపింది.

"ఏటోనమ్మగారూ! దానికి నాకంటే మీరే యెక్కువ. ఇక్కడ మీరు చూసినట్టు నేను చూడగలనా చెప్పండి" అంటూ తీసికెళ్ళబోతుంటే రాజమ్మ సావిత్రి కాళ్లకు చుట్టేసుకుని భోరుమని యేడ్చి వెళ్లింది.

తీరా వెళ్లిపోయాక యిల్లంతా బోసిపోయినట్లయింది సావిత్రికి. అమ్మగారూ, అమ్మగారూ అంటూ యిల్లంతా రాజమ్మే తిరుగుతున్నట్టు అనిపించసాగింది. జబ్బుపడ్డ పిల్లని పంపేసి తప్పుచేసానేమో అన్న భావన మనసులో మొలకెత్తి వొక్కరోజులో వటవృక్షమైపోయింది. ఏ పనీ చెయ్యాలన్పించడంలేదు. తిండి సయించడంలేదు. పల్లెలో రాజమ్మ యెలా వుందోనన్న ఆలోచనే సావిత్రికి.

ఆలోచనల్లోవున్న రామ్మూర్తి వంట

గది సర్ది సావిత్రి యెప్పుడొచ్చిందో గమనించలేదు. మంచంమీద వో ప్రక్కగా కూర్చుని వీక్లీలో పేజీలు తిరగేస్తున్న భార్యను చూసి "ఏమిటోయ్ అలా వున్నావ్? ఒంట్లో బావుండలేదా?" అన్నాడు.

అంతవరకూ మనసులో దిగమింగిన దుఃఖం వొక్కసారి కట్టలు తెగి ప్రవహించింది.

"పాపిష్టిదాన్నండీ! రెండేళ్లు దాని చేత చాకిరీ చేయించుకుని వొక్కసారి దానికి జబ్బుచేస్తే పంపించేసేను. ఈ రెండేళ్లూ పిల్లలగ్గాని నాగ్గాని రోగమొచ్చినప్పుడల్లా సొంతమనిషిలాగ యెంతపని చేసింది. నన్నొదిలేసి పోయిందా? వైద్యం చేయించినా యిక్కడే తగ్గలేదు, ఆ పల్లెటూర్లో యేం వైద్యం వుంటుంది? రాక్షసిలా ప్రవర్తించి దాన్ని ఆడిపోసుకుని, దాని మనసెంత కష్టపెట్టేనో! వెళ్ళేప్పుడు యెలా యేడిచిందని! దానికి తగ్గుతుందంటారా? మన పనిమీద బజారు వెళ్ళబట్టే కదా దానికి యీ కష్టాలు" అంటూ వెక్కివెక్కి యేడవసాగింది.

"పనివాళ్ళుకూడ సాటి మనుషులనీ, మనకుండే బాధలు, కష్టాలు, సుఖాలు, మనిషిలో వుండే మార్పులు వాళ్లకూ సహజమని అంగీకరించగలిగితే యీ బాధ వుండదు. వాళ్లు యే మార్పూ లేకుండా యెప్పుడూ యంత్రాల్లా పని చేసుకుపోవాలని కోరుకుంటాం. కోరుకున్నదానికి యేమాత్రం విరుద్ధంగా జరిగినా వాళ్ళమీద పెంచుకున్న అభిమానాన్ని కసిగా మార్చుకుంటాం. కాస్త మనసున్న వాళ్లకైతే మంచిచెడుల ఆలోచన జరిగి ఘర్షణ తప్పదు. ఇలా బాధా తప్పదు" అని చెపుదామనుకుని భార్యను వోదార్చే ప్రయత్నంలో "నువ్వుమాత్రం యేం చేసావ్! పదిరోజులు చెయ్యగలిగిందంతా చేసే కదా పంపించేవు. అదీకాక మన పరిస్థితి ఆలోచించుకోవాలి కదా. ఈ రోజుల్లో వొక మనిషికి మరో మనిషి యెంత బరువో తెలియనిదా? నాలుగు రోజులుగా యెంత ఖర్చయ్యిందో ఆలోచించు" అని యింకా చెప్పబోతున్న రామ్మూర్తికి సావిత్రి అడ్డుతగిలింది.

"అలా అని మన చిన్ని కేమయినా అయితే డబ్బయిపోతుందని చూసుకుంటామా! నాలుగురోజులు వైద్యం చేయించేం. ఇక మనం చెయ్యగలిగిందేం లేదని చేతులు కట్టుక్కూర్చుంటామా?" అంటూ యేడుస్తూ రామ్మూర్తి గుండెల్లో తలదాచుకుంది.

సమాధానం యేం చెప్పాలో, యెలా వూరడించాలో తెలియక రామ్మూర్తి సావిత్రి వీపు నిమరసాగేడు.

——